# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

## -65 డాక్యుమెంట్లు, లక్ష రూపాయాలు స్వాధీనం

**సంగారెడ్డి టౌన్/కంది, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఏసీబి దాడులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. ఏసిబి అధికారులు కార్యాలయానికి చేరుకున్నట్లు పసిగట్టిన కార్యాలయ అధికారులు, సిబ్బంది తమ జాగ్రత్తలో భాగంగా కార్యాలయ కిటికీల నుంచి నగదు బయటకు పారేశారు. నగదును కిటకీల్లోంచి బయటకు పారేయడాన్ని పసిగట్టిన ఏసీబి అధికారులు నగదును స్వాధీనం చేసుకుని కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యాలయం అవరణలో ఉన్న అధికారుల, ఏజంట్ల వాహనాలను అధికారులు క్షుణంగా పరిశీలించారు. అధికారులు చేసిన సోదాల్లో 56 డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకుని విచారం ప్రారంభించారు. కార్యాలయంలో ఏసీబీ అధికారులు వుక్రవారం ఉదయం వరకు సోదాలు నిర్వహించడంతో శుక్రవారం కార్యాలయంలో పనులు ఆలస్యంగా మొదలయ్యాయి.




# నూతన చట్టాలతో మహిళలకు మరింత రక్షణ : సిపి అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
నూతన చట్టాలతో మహిళలకు మరింత రక్షణ లభిస్తుందని సీపీ డా॥అనురాధ అన్నారు. శుక్రవారం జూలై నెలలో షీటీమ్స్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు, సిబ్బంది వివిధ ప్రదేశాలలో, కాలేజీలలో నిర్వహించిన అవగాన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు మౌనం వీడితే విజయం సాధిస్తారని తెలిపారు. సైబర్ నేరాట పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని హాట్స్పాట్ వద్ద షీటీమ్స్ తో నిరంతరం నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ల వారీగా షీటీమ్స్ పని చేస్తున్నాయన్నారు. కళాశాలల్లో వివిధ ప్రదేశాల్లో నూనత చట్టాలు, సైబర్ నేరాలతోపాటు వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జూలై 1 నుంచి దేశ వ్యాప్తంగా నూతన చట్టాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. మహిళలకు, పిల్లలకు, నూతన చట్టాలు అండగా రక్షణగా నిలుస్తాయన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్‌చేస్తే తక్షణమే పోలీసు సహాయం అందించడం జరుగుతుంద న్నారు. స్నేహిత మహిళా సపోర్టు సెంటర్ సేవలు వినియోగించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ఆగస్టు 2,ప్రభాతవార్త :** ప్రస్తుత వర్ష కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని దీంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టేందుకు ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అదేశించారు. 5 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాలు జిల్లాలో నిర్వహణపై జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాలతో కలిసి పంచాయతీరాజ్, వైద్య అరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, ఎంపివోలు, పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వచ్ఛదనంన పచ్చదనం కార్యక్రమాలు నిర్వహణకు గ్రామ, మున్సిపల్ వార్డుల స్థాయిలో టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. పచ్చదనం పెంపుకు పెద్దఎత్తున మొక్కలు నాటాలన్నారు. పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలన్నారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం విజయవంతం అవుతుందని ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానం కార్యక్రమాలల్లో విరివిగా పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో డీపీవో దేవకీదేవి, డిఆర్‌డివో జయదేవ్, అటవీశాఖ అధికారి శ్రీనివాస్, డిఎంఅండ్‌హెచ్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేట పట్టణంలోని సెట్విన్ సాంకేతిక శక్షణ సంస్థను జిల్లా కలెక్టర్ మను చౌదరి అకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పరిశీలించి అభినందించారు.


## వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ




మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

**వెల్దుర్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి కేసుల నమోదు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను ఎస్ఐ నవతాగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 30 మంది ప్రత్యేక సిబ్బందిని నియమించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాల తనిఖీలు చేయడం, దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ నిర్వహించడం, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు ప్రత్యేకంగా వాహనదారులను తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇటీవల పోలీసులు బైక్ దుకాణాల్లో తనిఖీలు చేయడం జరిగిందని, పత్రాలు లేని వాహనాల కొనుగోలు, అమ్మకాలు చేయవద్దని, సరైన పత్రాలు ఉన్న వాహనాలనే కొనుగోలు చేయాలన్నారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను, బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ పెంచే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, స్థానిక ఎస్ఐ నవతాగౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్దుర్తి పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌వో



మాట్లాడుతన్న డీఎంహెచ్‌వో శ్రీరామ్

**వెల్దుర్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరామ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను, రోగుల రిజిష్లర్లను పరిశీలించారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రోగులకు సిబ్బంది మెరుగైన వైద్య సదుపాయలు కల్పించాలన్నారు. రోగులకు సహకరిస్తూ వారికి కావలసిన మందులను ఇవ్వాలన్నారు. వీరి వెంట అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నవీన్, వైద్యాధికారి సరోజ, సిబ్బంది ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం

### -పరీక్షలు చేయించుకున్న 500 మంది రోగులు

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** పట్టణంలోని ంరైతు బజార్ వద్ద ఉన్న సాహితి ఆసుపత్రిలో శుక్రవారం మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి పట్టణంలోని ఆయా వార్డులతో పాటు పరిసర గ్రామాల నుంచి 5 వందల మంది రోగులు చేరుకుని పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి చేరుకున్న ప్రజలకు వైద్యులు పవన్‌కుమార్, ఆర్తో డాక్టర్ అబ్దుల్ రావుఫ్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీనివాస్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరానికి చేరుకున్న వారికి షుగర్, బిపి, ఆర్తో, నరాల సమస్యలకు ఉచితంగా డాక్టర్లు పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి డైరెక్టర్ రాము తెలిపారు.



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

# విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అధికారులకు, ప్రజలకు కలెక్టర్ సూచన

**పాపన్నపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు అంగన్‌వాడి కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలను పరిశీలించారు. గృహ జ్యోతి లబ్దిదారుల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడికేంద్రాల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్ స్థాయిలో విద్యాబోధన సాగుతోందని ఉపాధ్యాయులను పనితీరును కొనియాడారు. పాఠశాలల్లో అహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా వన మహోత్సవాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. అంగన్‌వాడి కేంద్రాలకు సరఫరా అవుతున్న గుడ్లు, బియ్యం, నూనే, పప్పు దినుసులు, పాల నాణ్యతమై అంగన్‌వాడి ఆయాలను అడిగితెలుసుకున్నారు. కేంద్రాల్లో చిన్నారుల హాజరును పరిశీలించి వారి తెలివితేటలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



మురుగుకాల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం...**
వర్షాకాలం కొనసాగుతున్నందున ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మండల పరిధిలోని గాంధారిపల్లిలో శుక్రవారం నిర్వహించిన డ్రై డేను కలెక్టర్ పరిశీలించారు. ఇంటి పరిసరాలను ఎవరికి వారు పరిశుభ్రంగా ఉంచుకుంటే గ్రామంలో పరిశుభ్రంగా ఉంటుందని, ఫలితంగా అంటురోగాల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి శుక్రవారం ప్రతి ఒక్కరు డ్రై డేను పాటించాలన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యం అన్న నిజాన్ని ఒక్కరు గుర్తించాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఇండ్లలోని డ్రమ్ములు, నీటి,పూల తొట్టిల్లో నీరు ఉండకుండా చూసుకోవాలన్నారు. మురుగుకాల్వలు పరిశుభ్రంగా ఉంటేనే దోమలు చేరుకోవని, ఫలితంగా అందరం అరోగ్యంగా ఉండే అవకాశాలు ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

# గీత కార్మికుల హక్కుల సాధనకు పోరాటం చేద్దాం



### కెజికెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ

**కొమురవెల్లి, ఆగస్టు 2,నప్రభాతవార్త :** అమరులైన సంఘం నాయకులను యాది చేసుకుంటూ కల్లుగీత కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.రమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గౌడ సంఘం అధ్యక్షేలు తాళ్లపల్లి రాజాగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 2 బొలగాని పుల్లయ్య 36వ వర్ధంతి నుంచి 18 వరకు సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ గీత కార్మకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిలో ప్రమాద నివారణ కోసం చేపట్టిన సేఫ్టీ మోకులను ఉచితంగా అందించాలన్నార. 50 యేండ్లు పై బడిన వారికి చేయూత పథకం కింద రూ.4 వేలు ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ భవనంనిర్మించాలన్నారు. సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాట చేయాలన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభ స్థలం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొహెడ కొమురయ్య, కార్యదర్శి బండకింది అరుణ్, జనగామ జిల్లా అధ్యక్షులు ఉప్పలయ్య, సంఘం ప్రతినిధులు వెంకటయ్య మల్లయ్య, శంకరయ్య, నర్సింలు, లింగం, కనకయ్య, కనకగౌడ్, విష్ణుమూర్తి, శ్రీనివాస్, నవీన్, భరత్, రమేష్, కనకయ్య, వెంకటేష్, నాయారణ, శ్రీనివాస్, నర్సింలు, నవీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల బ్రతుకుల్లో వెలుగు సుప్రీంకోర్టు తీర్పు

### ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్

**కొల్చారం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** తరతరాలుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రగతికి దూరమై నలిగిపోయిన మాదిగ బ్రతుకుల్లోకి వెలుగులను తీసుకు వచ్చేదిగా సుప్రీంకోర్టు మిగిలిపోతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్‌మాదిగ అన్నారు. శుక్రవారం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇస్తూ ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంగాయిపేటలో పెద్దఎత్తున సంబరాలను చేయడం జరిగింది. ఈ సందర్భంగా బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టాపాసులు కాలుస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ద్వారా మాదిగ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందన్నారు. అన్యాయం తాత్కాలికంగా గెలిచినా అంతిమంగా న్యాయమే గెలిచి తీరుతుందని, సామాజిక న్యాయమే నిలబడి తీరుతుందని అన్నారు. ఈ తీర్పు వల్ల విద్యా, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాల్లో మాదిగలు అభివృద్ధివైపు నడుస్తారని అన్నారు. జస్టిస్ చంద్ర చూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనానికి యావత్తు మాదిగ జాతికి తరపున కృజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసే మొదటి రాష్ట్రం తెలంగాణ అవుతుందని ప్రకటించి ఆచరణలో పెట్టి నిబద్ధతను చాటుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల సీంజీవయ్య మాదిగ, జిల్లా కార్యదర్శి పెద్దలింగన్నగారి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి, సుల్తాన్‌గారి కృష్ణ మాదిగ, ఎంఎస్ఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు పుర్ర మహేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామఅధ్యక్షులు ఆగంగౌడ్, చిన్నిగారి ముర్తత్, పెద్దలింగన్నగారి కిష్టయ్య, పుర్ర మల్లయ్య, కందె లచ్చయ్య, చిన్నిగారి దుర్గయ్య, కొజ్జపురం దేవయ్య, పుర్ర రాజు, చిన్నిగారి ప్రతాప్, కొజ్జాపురం రాజు, పుర్ర జాన్, బంగారిగల్ల శ్రీకాంత్, పుర్ర కుమార్, చిన్నగారి శ్రీనివాస్, రాజు, కొజ్జపురం గిరి, పుర్ర సుధాకర్, సని కార్తీక్, రవి, చిన్నిగారి దేవదాసు పాల్గొన్నారు.



ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మాట్లాడుతున్న ఎంపిడిఓ యాదగిరి

## స్వచ్ఛదనం-పచ్చదనంతో పల్లెల అభివృద్ధి : ఎంపిడివో

**జగదేవ్‌పూర్, ఆగస్టు 2 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జగదేవ్‌పూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.యాదగిరి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఈనెల 5 నుండి చేపట్టనుందని, ఈ కార్యక్రమంతో ప్రతి గ్రామం పారిశుధ్య గ్రామాలుగా రూపుదిద్దుకుంటాయని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 5న గ్రామాల్లో స్వయం సహాయ సంఘాల మహిళలు, యువతతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో ర్యాలీలు చేపట్టాలన్నారు. 6వ తేదీన గ్రామాల్లోని నీటి ట్యాంకులను శుభ్రంచేసి క్లోరినైజేషన్ చేపట్టాలని, 7న రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టాలని, 8న వైద్యాధికారులతో కలిసి డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడకుండా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని, 9న ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రంచేయడంతోపాటు వన మహోత్సవంలో భాగంగా మొక్కలునాటాలని సూచించారు. గ్రామాల్లోని నాయ కుల, ప్రజల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రఘువీరారెడ్డి, సూపరింటెండెంట్ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ యాదయ్య, హెల్త్ సిబ్బంది జితేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు హరీష్, రాజగోపాల్, కృష్ణారెడ్డి, నవీన్, రవి, వెంకటేశం, నరేష్‌రెడ్డి, మమత, విక్రమ్, సాయిబాబా, నాగరాజు, మమత తదితరులు పాల్గొన్నారు.

## అలుపెరుగని యోధుడు మందకృష్ణ మాదిగ

### -ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి

**జగదేవ్‌పూర్, ఆగస్టు 2 (ప్రభాతవార్త):** మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటంతో మూడు దశాబ్దాల పోరాట కల ఎస్సీ వర్గీకరణ సాకారమైందని సిద్దిపేట జిల్లా ఎంజేఎఫ్ అధ్యక్షుడు గుర్జకుంట రామస్వామి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేయడం వల్లే ఈరోజు ఎస్సీ వర్గీకరణ చేయాలని భారతదేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడం జరిగిందని, ఈ ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు రావడం హర్షించదగ్గ విషయమని, ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మందకృష్ణ మాదిగ చేసే ఏ పోరాటమైనా ఒక మాదిగ జాతికి మాత్రమే కాకుండా అన్ని కులాలకు ఉపయోగపడుతుందని, ఎస్సీ ఉపకులాలు అందరు కూడా మందకృష్ణ మాదిగ ఫోటోను ఇంట్లో పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జాంగీర్, గందమల్ల శివదాసు, నాయకులు భాస్కర్, ఎంఈఎఫ్ నియోజకవర్గ నాయకుడు రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మాసపాక యాదగిరి, మచ్చ బాబు, సుధాకర్, ప్రశాంత్, మండల నాయకులు నర్సింలు, నాగరాజు, ఇస్తారి, తిరుపతి, మైసయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.



మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న తూంకుంట నర్సా రెడ్డి

## విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం

### -డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, ఆగస్టు 2 (ప్రభాతవార్త):** గ్రామీణ విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తూ కాంగ్రెస్ సర్కార్ సమూల మార్పులకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న సిఎం రేవంత్‌రెడ్డి అభినందన సభకు శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులు తరలివెళ్తున్న సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మండల విద్యాధికారులు సునీత, ఉదయభాస్కర్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషిఫలితంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతులు తదితర అంశాలు పరిష్కారం కావడం చరిత్రాత్మకంగా నిలుస్తుందని అన్నారు. అంతేకాకుండా నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థ బలోపేతం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయుల నియామకం తదితర వాటిని చేపట్టేందుకు చర్యలు తీసుకుంటుండగా, ఉద్యోగ నియామక ప్రక్రియ ప్రారంభించిన కాంగ్రెస్ సర్కార్‌కు నిరుద్యోగులు, యువత రుణపడి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి రాజు, సుభాష్‌చంద్రబోస్, నరేందర్‌రెడ్డి, మొనగారి రాజు, నక్క రాములుగౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, సర్దార్‌ఖాన్, సమీర్, బలరాం, రమేష్‌గౌడ్, అజ్గర్, శివారెడ్డి, యాదగిరి, మోహన్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ఉపాధ్యాయ సంఘ నేతలు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, కనకరాజు, శ్యామ్‌సుందర్‌గుప్త పాల్గొన్నారు.

## వర్గీకరణకు మద్దతు తెలిపిన సిఎంకు కృతజ్ఞతలు



సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడంతో శుక్రవారం మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణ అంశాలపై మాజీ మంత్రి చంద్రశేఖర్ సిఎంకు వినతి పత్రం అందచేశారు. శాసన సభ సాక్షిగా వర్గీకరణను అమలు చేస్తామని సిఎం పేర్కొనడం ఆనందంగా ఉందన్నారు. గ్రూప్ 1, 2, ప్రస్తుత నియామకాల్లోనూ రిజర్వేషన్లు అమలు చేస్తామని సిఎం హామి చేశారని మాజీ మంత్రి గుర్తు చేశారు కార్యక్రమంలో దేవనని సతీష్ మాదిగ, గజ్జల కాంతం, వెంకటేశ్, ఉట్ల ప్రసాద్ ఉన్నారు.

## ఘనంగా తీస్ ఉత్సవాలు

**కంది, ఆగస్టు 2, ప్రభాతవార్త:** తీస్ పండుగను గిరిజనులు ఆనందోత్సవాలతో మండల పరిధిలోని వెంటరావు ముక్త తండాలో ఘనంగా శుక్రవారం జరుపుకున్నారు. ఉత్సవాలను పురష్కరించుకుని తండాలో కొలువున్న దుర్గాభవాని మాత ఆలయంలో గిరిజనులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన మహిళలు కోలాటలు ఆడుతూ, పాటలను ఆలపిస్తూ చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. తండా సమీపంలోని చెరువులో పూజించిన నవధాన్యాల గంపలను నిమర్జనం చేశారు కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ సురేష్ నాయక్, తండా వాసులు పాల్గొన్నారు.



తీస్ పండుగను జరుపుకుంటున్న గిరిజనులు

# ఇంటింటి ఇన్నోవేటర్ దరఖాస్తు గడువు పొడిగింపు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ అర్బన్, ఆగస్టు 2 ప్రభాతవార్త:**
తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఇంటింటి ఇన్నోవేటర్ 2024 దరఖాస్తు పొడగించిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కర్తలు తమ ఎంట్రీలను సమర్పించడానికి ఆగస్టు 10, 2024 వరకు ఆఖరి తేదీని పొడిగిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 6వ ఎడిషన్‌తో ముందుకు వచ్చిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం గ్రామీణ తెలంగాణలో ఆవిష్కరణ, వ్యవస్థాపకతను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుందని స్థానిక సవాళ్లకు పరిష్కారాలను తీసుకువచ్చే ఉద్దేశంతో తమ ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు తయారు చేసిన ప్రజలను రాష్ట్ర ప్రజలకు పరిచయం చేస్తూ ఆ ఆవిష్కరణలను ఆగస్టు 15న ప్రదర్శించచే అవకాశాన్ని అందిస్తుందన్నారు. గ్రామీణ తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్క ఆవిష్కర్తను ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరుతున్నాం. తమ అద్భుతమైన ఆలోచనలతో స్థానిక సమస్యలకు ఆవిష్కరణలు తయారు చేసి ఆ సమస్యకు అడ్డుకట్ట వేసిన ప్రతి ఒక్క ఆవిష్కర్తను దరఖాస్తు చేసుకునేందుకు ఆహ్వానిస్తున్నామని సవాళ్లను పరిష్కరించే అత్యంత ఆశాజనకమైన పరిష్కారాలు ఆగస్టు 15, 2024న అవార్డులతో గుర్తించబడతాయని చెప్పారు. ఈ సంవత్సరం మరిన్ని ఔత్సాహిక ఆవిష్కర్తలకు సమగ్ర మద్దతు అందించేందుకు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ సిద్ధంగా ఉందన్నారు. ఈ సంవత్సరం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ఎన్నడూ లేనివిధంగా విస్తృతమైన గ్రామీణ ఆవిష్కరణలపై దృష్టి సారించడమే కాంకుడా మొత్తం 33 జిల్లాల్లోని 3 వేలకుపైగా గ్రామ పంచాయతీలకు 550 మందికి పైగా ప్రభుత్వ అధికారులకు ఆవిష్కరణ సంస్కృతిపై అవగాహన కల్పించిందన్నారు. ఇంటింటా ఇన్నోవేటర్ కోసం దరఖాస్తు ప్రక్రియ చాలా సులువుగా ఉంటుంది. ఆవిష్కర్తలు వాట్సాప్ ద్వారా 91006 78543 దరఖాస్తులను సమర్పించవచ్చు. పేరు, వయస్సు, ఫోటో, వృత్తి, గ్రామం, మండలం, ఆవిష్కరణ పేరు, ఆవిష్కరణ గురించి 100 పదాల వివరణ, నాలుగు అధిక రిజల్యూషన్ చిత్రాలు, రెండు వీడియోలు (2 నిమిషాలలోపు) పంపించగలరని చెప్పారు.

తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ గురించి తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ అనేది తెలంగాణ ప్రభుత్వంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రారంభిచబడింది. తెలంగాణ రాష్ట్రంలో ఆవిష్కరణ సంస్కృతిని నిర్మించడంతోపాటు పెంపొందించడం కోసం 2017 లో స్టేట్ ఇన్నోవేషన్ పాలసీ కింద తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఆవిష్కర్తలకు అంకురాలకు, వ్యవస్థాపకులకు సమ్మిళిత ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రతిస్పందనగా గుర్తించబడిందని ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు.

